క్లుప్తంగా

ఘనంగా పాషాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ



సోమవరంలో పాషాలమ్మను దర్శించుకుంటున్న తోట నరసింహం, రాంజీ

కిర్లంపూడి: మండలంలోని సోమవరం గ్రామంలో పాషాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ శనివారం ఘనంగా జరిగింది. వేదపండితులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ కో ఆర్డినేటర్ తోట నరసింహం, యువ నాయుడు తోట రాంజీ అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అడబాల నాగు, కడిమి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం



వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న మున్సిపల్ కౌన్సిలర్లు

ఏలేశ్వరం: పట్టణంలో శనివారం వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని స్థానిక కంబాలపాలెం కాలనీలో జైభీమ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ మెమోరియల్ టోర్నమెంట్‌ను మున్సిపల్ కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపాలకృష్ణ, మూది నారాయణస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో నియోజకవర్గంలోని 16 జట్లు పాల్గొంటాయని తెలిపారు. చివరి రోజు విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కోనాల వెంకటరమణ, క్వారీ యూనియన్ అధ్యక్షుడు కుప్పుల నాగభూషణం, వాగు రాజేష్, జొన్నాడ వీరబాబు, జై భీమ్‌యూత్ సభ్యులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కిర్లంపూడి: బూరుగుపూడిలోని ప్రభుత్వ ఆయుష్ ఆయుర్వేద వైద్యశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసేందుకు ఫిమేల్ యోగా గురువు పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆసుపత్రి డాక్టర్ జె.మాధురి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నెలలో 20 గంటలు పనిచేయవలసి ఉంటుందన్నారు. యోగాలో డిగ్రీ, పీజీ, డిప్లమా చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 94910 11909 నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఎంపికైన అభ్యర్థికి గంటకు రూ.250 చొప్పున గౌరవ వేతనం ఇస్తామని తెలిపారు.

నీటి తొట్టెల నిర్మాణానికి శంకుస్థాపన



యర్రవరంలో నీటితొట్టెలకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: మండలంలో పశువులకు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టినట్టు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి తెలిపారు. మండలంలోని పెద్దనాపల్లి, యర్రవరం, సిరిపురం, పేరవరం, భద్రవరం, సి.రాయవరం, లింగంపర్తి గ్రామాల్లో శనివారం ఉపాధి పనుల్లో భాగంగా పశువులకు నీటి తొట్టెల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పశువులకు నీటి ఎద్దడి లేకుండా నీటి తొట్టెలు నిర్మిస్తున్నట్టు చెప్పారు. నీటి సమస్య తలెత్తకుండా అధికారులను అప్రమత్తం చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణ, జనసేన నేత పెంటకోట మోహన్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

హైస్కూల్ హెచ్‌ఎం రంగారావుకు డాక్టరేట్



హెచ్‌ఎం రంగారావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం టీవీఎస్ రంగారావుకు డాక్టరేట్ లభించింది. పాఠశాల అభివృద్ధికి ఎనలేని కృషి చేయడంతో పాటు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడంతో తనకు డాక్టరేట్ వచ్చిందని రంగారావు తెలిపారు. సౌత్ ఆఫ్రికాకు చెందిన ఎపికై జో ప్రొఫిటిక్ బైబిల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో డాక్టరేట్‌ను ప్రదానం చేశారన్నారు. వందన యూత్ వలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు పులి ప్రసాద్, తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు నామాల కృష్ణమోహన్, హస్నర్ బేగం, టీఎస్ఎస్ మూర్తి, ఉపాధ్యాయులు అవార్డు గ్రహీతకు అభినందనలు తెలిపారు.

మెరిసిన కుసుమాలు

- ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల ప్రతిభ
- సత్తాచాటిన బాలికలు
- ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందనల వెల్లువ



పెండ్యాల రాజశేఖర్, సుసానే రాణి, ఆనూష ఆలేఖ్య, హర్షిత ప్రవల్లిక, దీపిక, బొల్లు మణిశ్రీ, దుళ్ళ సత్య



బొల్లు వీర దుర్గ నాగ ఐశ్వర్య, పి.సూరిదేవి, ఎ.అమ్మాజీ, ఎం.సరోజిని, ఎం.భావన దుర్గ, చిట్రా ఉమా అనిత, తుట్టా సత్యసాయి



బి.యామిని, రెడ్డి రాజేష్, పెంటకోట స్పందన, అమరాధి శ్రావ్య, అల్లు నందిని, పి.భార్గవరమ్య, సరిపల్లి కార్తిక్

తుని: ఇంటర్ ఫలితాల్లో బాలికలు సత్తా చాటారు. శనివారం విడుదల చేసిన ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ఫలితాల్లో తుని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల బాలికలు అత్యుత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ డి.విజయలక్ష్మి తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 60 శాతం, సెకండ్ ఇయర్‌లో 78 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని పి.సూరిదేవి 969/1000, బైపీసీలో ఎ.అమ్మాజీ 898/1000, సీఈసీలో ఎం.సరోజిని 843/1000, హెచ్‌ఈసీలో ఎం.భావన దుర్గ 846/1000 మార్కులు సాధించారు. ఎంపీహెచ్‌డబ్ల్యూసీఎఫ్‌లో వై.నాగజోత్స్నవి 945/1000, ఎంఎల్‌టీలో ఎ.రమ్య 940/1000, సీఎస్‌ఈలో ఎస్.నాగరత్నం 959/1000 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో వై.కావ్య 416/470, బీజీఆర్ఎంలో జి.ధనలక్ష్మి 478/500లతో ప్రథమ స్థానంలో నిలిచారు. వీరితో పాటు పలువురు విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ చూపారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, అధ్యాపకులు, అభివృద్ధి కమిటీ సభ్యులు అభినందించారు.

ఏలేశ్వరం: ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో ఏలేశ్వరం విద్యార్థులు ప్రతిభ చూపి ఉత్తమ మార్కులు సాధించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం 60 శాతం, ద్వితీయ సంవత్సరం 85 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో పెండ్యాల రాజశేఖర్ 972(1000) మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. సెకండ్ బైపీసీలో సుసానేరాణి 928 (1000) మార్కులతో రెండోస్థానం, పెండ్యాల మేరిసునంద 920 (1000) మార్కులతో తృతీయస్థానం సాధించారు. సెకండ్ ఎంపీసీలో కందాల శ్రీహర్షిత 916 మార్కులు సాధించింది.

ప్రత్తిపాడు: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాల్లో ప్రత్తిపాడు అఖిల్ జూనియర్ కళాశాల విద్యార్థిని బొల్లు మణిశ్రీ 470 మార్కులకు గానూ 464 మార్కులతో మండలంలో ప్రథమ స్థానం సాధించింది. 462 మార్కులతో ప్రత్తిపాడు మినర్వా జూనియర్ కళాశాల విద్యార్థిని దుళ్ల సత్య రెండో స్థానంలో నిలిచింది. అఖిల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఫస్ట్ ఇంటర్ ఫలితాల్లో 90.6 శాతం, ఇంటర్ రెండో సంవత్సరం ఫలితాల్లో 88.7 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు కళాశాల అధినేత ఇనకోటి గంగాధర్ తెలిపారు. మినర్వా జూనియర్ కళాశాలలో ఫస్ట్ ఇంటర్ పరీక్ష ఫలితాల్లో 77 శాతం, సెకండ్ ఇంటర్ ఫలితాల్లో 68.6 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ ఆనందకుమార్ జోషి తెలిపారు. తమ కళాశాల నుంచి సెకండ్ ఇంటర్ పరీక్షలో బొల్లు వీర దుర్గ నాగఐశ్వర్యకు 1000 మార్కులకు గానూ 982 మార్కులతో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ జోషి తెలిపారు.

రౌతులపూడి: మండలంలోని ఎ.మల్లవరం సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో మొదటి సంవతర్సం ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో 37 మంది విద్యార్థులకు గాను 23 మంది (62 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం ఫలితాలో 54 మంది విద్యార్థులకు గాను 38 మంది (70 శాతం) ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ విజయ్‌బాబు తెలిపారు. రౌతులపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో 56 మందికి కేవలం ఒక్కరు మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. ములగపూడి ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీలో 19 మందికి ఇద్దరు ఎంపీసీ విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం 13 మంది విద్యార్థులకు గాను ఒకే ఒకరు ఉత్తీర్ణులయ్యారని పిన్సిపాల్స్ తెలిపారు.

90 శాతం ఉత్తీర్ణత

తుని రూరల్: హంసవరంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థినులు ఇంటర్‌లో 90 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మజ తెలిపారు. పాఠశాల నుంచి 50 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరుకాగా 45 మంది (90 శాతం) ఉత్తీర్ణులైనట్టు ఆమె పేర్కొన్నారు. జూనియర్ ఇంటర్‌లో 79 మంది పరీక్షలు రాయగా 60 మంది (63 శాతం) ఉత్తీర్ణులైట్టు తెలిపారు. ఎంపీసీలో చిట్రా ఉమాఅనిత 972 మార్కులు, బైపీసీలో తుట్టా సత్యసాయిశ్రీ 900 మార్కులు, ఇంటర్ మొదట సంవత్సరం ఎంపీసీలో రెడ్డి రాజేష్ 470కి 462 మార్కులు, బైపీసీలో పెంటకోట స్పందన 440కి 391 మార్కులు సాధించారన్నారు. వి.కొత్తూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల జూనియర్ కళాశాలలో 29 మందికి 19 మంది (65.5శాతం) ఉత్తీర్ణులైనట్టు ప్రిన్సిపాల్ నిర్మల కుమారి తెలిపారు. సీఈసీలో బి.యామిని 858 మార్కులు, ఎస్.లావణ్య 857 మార్కులు సాధించారన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 45 మందికి 26 మంది పాసైనట్టు తెలిపారు.

కేజీబీవీలో 38 శాతం ఉత్తీర్ణత

శంఖవరం: స్థానిక కస్తూర్బా గాంధీ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 37 శాతం, ప్రథమ సంవత్సరంలో 38 శాతం ఉత్తీర్ణత



రోమాల నాని, కాయల యామినీప్రియ

సాధించినట్లు కళాశాల ప్రత్యేకాధికారి బాలమణి కుమారి శనివారం తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు 19 మంది పరీక్షలకు హాజరు కాగా ఏడుగురు (37 శాతం) ఉత్తీర్ణత సాధించారన్నారు. ప్రథమ సంవత్సర విద్యార్థినులు 34 మంది పరీక్షలు రాయగా 13 మంది (38 శాతం) పాసయ్యారన్నారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులను ఎస్ఓ బాలమణికుమారి అభినందించారు. కత్తిపూడి సీతారామ కళాశాల విద్యార్థులు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 85 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ వీరబాబు తెలిపారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగి ఎస్ఎస్ఎన్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని అమరాధి శ్రావ్య (శరభవరం) ఎంపీసీలో 1000/970, మొదటి సంవత్సరం ఫలితాల్లో కర్నీడి మౌనిక, దాడిశెట్టి శ్రీచంద్రకళ ఎంపీసీలో 470/457 మార్కులు సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ సుంకర వీరబాబు, అధ్యాపకులు అభినందించారు.

గురుకులంలో వందశాతం ఉత్తీర్ణత

స్థానిక గురుకుల బాలికల కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ చంద్రశారద తెలిపారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 56 మంది విద్యార్థులు హాజరుకాగా 48 మంది ఏ గ్రేడ్, 8 మంది బీ గ్రేడ్ సాధించారు. వీరిలో ఎంపీసీలో అనూష ఆలేఖ్య 965 (1000), హర్షిత ప్రవల్లిక 951(1000) మార్కులు సాధించగా బైపీసీలో దీపిక 941 (1000) మార్కులు సాధించింది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పలువురు అభినందించారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థుల హవా



మరిచెట్ల హారికనాగసాయి

గోకవరం: ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో మండలంలోని కామరాజుపేట హైస్కూల్ ప్లస్, ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు సత్తా చాటారు. కామరాజుపేట హైస్కూల్ ప్లస్‌కు చెందిన మరిచెట్ల హారిక నాగసాయి(924), కొప్పుల ప్రణీత(903), ప్రథమ సంవత్సర ఫలితాల్లో పెనుకొండ సత్యసూర్యశ్రీ(410), గౌతు శ్రీలక్ష్మి(403), ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ద్వితీయ సంత్సరానికి చెందిన కె.విజయకుమార్(979), ఫస్టియర్‌లో నందూరి నాగసూర్య చక్ర(455), కొండమంచిలి గణేష్(424), బలిజ జాన్‌ప్రకాష్ రెడ్డి(412), ప్రతి రాజశ్రీ(407), షేక్ తహసీన(403) మార్కులు సాధించినట్టు ఆయా కాలేజీల అధ్యాపకులు తెలిపారు.

కిర్లంపూడి జూనియర్ కాలేజీ విద్యార్థుల హవా

కిర్లంపూడి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో రోమాల నాని(919), ఎంయూవీడీ మహేశ్వరరావు(878), బలసా గంగోత్రి (866) బైపీసీలో శరకణం మౌనిక(935), మూరా ఉమావైష్ణవి (836), ఒకేషనల్‌లో కారక చినవెంకన్న (868), ప్రథమ సంవత్సరంలో ఒకేషనల్‌లో కె.ఎస్‌వీవీ సత్యన్నారాయణ(445) మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం జనరల్ 24 శాతం, ద్వితీయ సంవత్సరం 41 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు కాలేజీ ప్రిన్సిపాల్ జె. కాంచనమాల తెలిపారు. తామరాడ ప్రభుత్వోన్నత పాఠశాల ప్లస్ మహిళా జూనియర్ కళాశాలలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కాయల యామినీప్రియ (871) మార్కులు సాధించి కాలేజీ టాపర్ నిలిచిందని కాలేజీ ప్రిన్సిపాల్ ఎల్. కృష్ణ తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయం



పోతులూరులో పార్టీ నేతలతో ముద్రగడ గిరిబాబు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు
- పోతులూరులో పర్యటన

ప్రత్తిపాడు రూరల్: రానున్న రోజుల్లో జరిగే ప్రతి ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. మండలంలోని పోతులూరులో ఆయన శనివారం పర్యటించారు. గ్రామ దేవత బోడ కొండమ్మతల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పార్టీ నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ పది నెలల్లోనే కూటమి ప్రభుత్వం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేక వ్యక్తమవుతోందన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైఎస్సార్ సీపీకి ఓట్లు వేసి గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం, సర్పంచ్ బొండి రాంబాబు, ఎంపీటీసీ ముప్పిడి ఏసుబాబు, పార్టీ నాయకులు శేరు కృష్ణ, జల్లిగంపల ప్రభాకరరావు, శెట్టి సత్తిబాబు, సీంద్రపు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



సామర్లకోట బాప్టిస్ట్ ఫీల్డు కౌన్సిల్ నూతన కార్యవర్గం

ప్రత్తిపాడు: సామర్లకోట బాప్టిస్ట్ ఫీల్డ్ కౌన్సిల్ అధ్యక్షుడిగా సామర్లకోటకు చెందిన డి.ఇజ్రాయేల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రత్తిపాడులోని ఎల్ఎఫ్‌టీఎల్ బాప్టిస్ట్ సంఘం ఆవరణలో శనివారం సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కౌన్సిల్ కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. కౌన్సిల్ గౌరవాధ్యక్షుడిగా ఈఎస్ సువార్తరాజు (సామర్లకోట), ఉపాధ్యక్షుడిగా కె.జాన్ డానియేల్ (గెద్దనాపల్లి), ప్రధాన కార్యదర్శిగా ఎం.చంద్రపాల్ (ప్రత్తిపాడు), ఉప కార్యదర్శిగా డి.ఇస్సాకు (గోనేడ), కోశాధికారిగా రాపా గుర్రాజు (ధర్మవరం), ఉప కోశాధికారిగా మేరీ ఝాన్సీ (వీరవరం)తో పాటు మరో పది మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పలు బాప్టిస్ట్ సంఘాల ప్రతినిధులు ఊబా కృపావరం, జాన్ సామ్యేలు, గుడాల రాజు, ఎ.పాల్ సామ్యేలు, ఆర్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేట నిషేధాన్ని పాటించాలి

కొత్తపల్లి: వేట నిషేధాన్ని మత్స్యకారులు తప్పనిసరిగా పాటించాలని మత్స్యశాఖ అధికారి శివరామకృష్ణ పేర్కొన్నారు. వేట నిషేధంపై అమీనాబాద్ హార్బర్‌లో శనివారం మత్స్యకారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14 అర్ధరాత్రి నుంచి జూన్ 15వ తేదీన వరకూ ప్రభుత్వం సముద్రంలో వేట నిషేధాన్ని ప్రకటించారన్నారు. ఈ నిషేధ ఆజ్ఞలను 61 రోజల పాటు సముద్రంలో మత్స్య సంపద పునరుత్పత్తి సంరక్షణ జరుగుతుందని, ఈ సమయంలో మెకనైజ్డ్, మోటరైజ్డ్ బోటులతో చేపల వేట చేయకూడదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ



విద్యార్థులకు పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న కార్యదర్శి కామరాజు

ప్రత్తిపాడు: స్థానిక బజారు వీధి రామాలయం వద్ద శనివారం సదా మీ సేవలో (ఎస్ఎంఎస్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్లు, ఆహార పొట్లాల పంపిణీ చేశారు. ధర్మవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి బి.కామరాజు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శ్రీషిర్డీ సాయి జ్యూయలరీస్ అధినేత పడాల శ్రీనివాసరెడ్డి, అంతర్జాతీయ ఛాయా చిత్ర అవార్డు గ్రహీత సలాది కృష్ణ, సంఘ సభ్యులు జి.సత్యానందం, భేరి రాంబాబు, ఎస్వీ సోమేశ్వరరావు, ఎస్.లోవకుమారి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చైత్ర పూర్ణిమ వేడుకలు



రాచపల్లిలో స్వామివారికి ప్రత్యేక పూజలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి అపితకుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి దేవస్థానంలో చైత్ర పూర్ణిమ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పండితులు స్వామి, అమ్మవార్లకు ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీలలితా సహస్రనామ పారాయణ, మణిదీప వర్ధన, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. తిరుచ్చి వాహనం స్వామి, అమ్మవార్లను ఊరేగించారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పఠనం

ఏలేశ్వరం: పట్టణంలో శనివారం హనుమద్విజయోత్సవం ఘనంగా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ మండల కార్యదర్శి కటకం కిరిటీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద దుర్గాదేవి ఆలయంలోని హనుమంతుని ఉపాలయం వద్ద హనుమాన్ చాలీసా, ఆంజనేయ దండకం, రామపారాయణం, శ్రీరామరక్షా స్తోత్రం నిర్వహించారు. హనుమంతునికి ప్రత్యేక పూజలు చేశారు. వీహెచ్‌పీ మాతృశక్తి సంఘ కార్యదర్శి కె.ఇందిరా, హైమావతి, కామాక్షి తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చైత్ర పౌర్ణిమ సందర్భంగా శనివారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు యనమంద్ర శర్మ, కోట వంశీ, వేణు, చెల్లపిల్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. 20 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఏలేశ్వరం మండలం పరిమితడక గ్రామంలో సారా స్థావరాలపై శనివారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. నిందితులు పరారు కాగా సంఘటన స్థలం నుంచి రెండు లీటర్ల సారా, సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో స్టేట్ టాస్క్‌ఫోర్స్ (మంగళగిరి) అధికారులు, ప్రత్తిపాడు ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్, తదితర సిబ్బంది పాల్గొన్నారు.



సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్న స్టేట్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

పంపాకు జలకళ

- వర్షాలకు రిజర్వాయర్‌లో స్వల్పంగా పెరిగిన నీటి నిల్వలు
- 15 నుంచి పంపాకు ఏలేరు జలాలు



వర్షపునీటితో కనువిందు చేస్తున్న పంపా

అన్నవరం: ఇటీవల వర్షాలు పడుతున్న నేపథ్యంలో పంపా రిజర్వాయర్‌కు జలకళ వచ్చింది. వర్షపు నీరు వచ్చి చేరుతుండడంతో రిజర్వాయర్ నీటి మట్టం స్వల్పంగా పెరిగి 81.40 అడుగులకు చేరింది. రిజర్వాయర్‌లో 0.012 టిఎంసీలకు నీటి నిల్వలు చేరాయి. గత వారం ఎండలకు పంపా రిజర్వాయర్‌లో నీటి మట్టం 79 అడుగుల వద్ద డెడ్ స్టోరీజీకి చేరిన విషయం తెలిసిందే. అప్పుడు నీరు 0.007 టీఎంసీ ఉండగా తరువాత ఎండలకు నీరు ఆవిరై నీటి నిల్వ 0.005 టీఎంసీలకు పడిపోయింది.

క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు

ఇటీవల పంపా క్యాచ్‌మెంట్ ఏరియా అయిన శంఖవరం, రౌతులపూడి మండలాల్లో కురిసిన వర్షాలకు నీరు భారీగా రావడంతో పోలవరం అక్విడెక్ట్ వద్ద వర్షపు నీరు చేరింది. దీంతో ఏలేరు నీరు పంపాకు వచ్చేందుకు తవ్విన కాలువతో పాటు, పాత కాలువ ద్వారా నీటిని పంపాకు విడుదల చేశారు. దీంతో 450 క్యూసెక్కుల నీరు పంపాకు వచ్చి చేరింది. ఇంకా నీరు వస్తున్నందున నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

పంపా రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 103 అడుగుల వద్ద 0.43 టీఎంసీ. ప్రస్తుత నీటిమట్టం 81.40 అడుగులకు చేరడంతో అన్నవరం దేవస్థానానికి, అన్నవరం గ్రామానికి కొంత ఊరట లభించినట్టే. కాగా వచ్చే నెలలో జరుగనున్న సత్యదేవుని కల్యాణ మహోత్సవాలకు, అలాగే దేవస్థానం, అన్నవరం గ్రామాల్లో నీటి సమస్య పరిష్కారం కోసం ఈ నెల 15 నుంచి ఏలేరు జలాలను పంపాకు విడుదల చేయనున్నారు. ఈ మేరకు ఇరిగేషన్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



స్నానఘట్టాల వద్ద పెరిగిన నీరు